జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 26 | జనవరి | 2026 ◆ పేజీలు : 3



## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

- మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం



**ఇల్లందు, జనవరి 25, ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 11, 12, 13 వార్డులలో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

మిగతా 2 లో...

- మండలానికి అంబులెన్స్ మంజూరు.. కానీ సేవలు మాత్రం గల్లంతు
- ఈ నెలలోనే 4–5 ప్రమాదాలు.. సమయానికి రాక ప్రాణనష్టం
- 'ఏజెన్సీ ప్రజల ప్రాణాలు విలువలేవా?' అంటూ మండలంలో ఆగ్రహం




# 108 సేవలు కరువు.. అధికారుల నిర్లక్ష్యమే కారణం!

**అన్నపురెడ్డిపల్లి, జనవరి 25, ప్రజాజ్యోతి :** భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో అత్యవసర సేవలు అందించాల్సిన 108 అంబులెన్స్ వ్యవస్థ పూర్తిగా విఫలమవుతోందని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ఈ మండలంలో రవాణా సదుపాయాలు సరిగా లేకపోవడంతో అత్యవసర సమయంలో అంబులెన్స్ అందక ప్రజలు ప్రాణాల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలానికి మంజూరైన 108 అంబులెన్స్ ఉన్నప్పటికీ సమయానికి అందుబాటులో ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల దూరం వెళ్లి వైద్యం పొందాల్సిన దుస్థితి నెలకొంది. అంబులెన్స్ సేవలు అందక ఇటీవల పలువురు ప్రమాద బాధితులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ప్రజలను కలచివేశాయి. నిన్న అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన ఓ గ్రామస్తుడు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడగా, అంబులెన్స్ సమయానికి రాకపోవడంతో చికిత్స ఆలస్యమై మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనతో మండలవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదొక్కటే కాదని ఈ నెలలోనే నాలుగు నుంచి ఐదు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, వాటిలో కూడా అంబులెన్స్ సమయానికి రాక బాధితుల

మిగతా 2 లో...




# ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం పరుచుకోవాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**పాల్వంచ :కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 25: ప్రజా జ్యోతి**

ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా, సద్వినియోగపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఆదివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన ,క్రీడల శాఖ ఆధ్వర్యంలో నూతన ఓటర్లతో నిర్వహించిన సైకిల్ ర్యాలీని కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే పాలకులను ఎన్నుకునే అత్యున్నత హక్కు ఓటు హక్కు అని అన్నారు. ప్రజల అభిప్రాయాలకు ఆమోదయోగ్యంగా, ఎక్కువ మంది ఆదరణ పొందిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిందని తెలిపారు. గతంలో ఓటు హక్కు సాధన కోసం అనేక త్యాగాలు, ఉద్యమాలు, పోరాటాలు జరిగాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జాతీయ ఓటరు దినోత్సవం ప్రతి పౌరుడు ఓటు హక్కు విలువ, విశిష్టతను అవగాహన చేసుకునేందుకు, ప్రజాస్వామ్య వ్యవస్థలో తన పాత్రను గుర్తించేందుకు ఒక మంచి అవకాశమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నూతన ఓటర్లు, యువత ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నూతన ఓటర్లు, యువత, ప్రజలు, అధికారులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ ప్రతిజ్ఞలో భాగంగా "భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై సంపూర్ణ విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుతామని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల నిర్వహణను

మిగతా 2 లో...




## రెండు ఆయుధ డంప్ లు స్వాధీనం



**చర్ల, జనవరి 25:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో గణతంత్ర దినోత్సవానికి ముందు నక్సలైట్ల ప్రణాళికలను భగ్నం చేయడంలో సి ఆర్ పీ ఎఫ్ భారీ విజయాన్ని సాధించింది. సుక్మా–బీజాపూర్ సరిహద్దులోని పాలగూడ అడవులలో నక్సలైట్లు ఏర్పాటు చేసిన రెండు ఆయుధ డంప్ లపై భద్రతా దళాలు దాడి చేశాయి . సి ఆర్ పీ ఎఫ్ యొక్క 150వ బెటాలియన్ నిర్వహించిన ఈ ఆపరేషన్ లో పెద్ద మొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు నక్సలైట్

మిగతా 2 లో...

## నేషనల్ హాకీ క్రీడకు తడికల భవిత ఎంపిక



**చర్ల, జనవరి 25: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం లింగాపురం గ్రామానికి చెందిన తడికల బబ్బి భవిత టీఎస్ డబ్ల్యూ ఆర్ ఐ ఈ ఎస్ పాల్వంచ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుకుంటూ వనపర్తి లో జరిగిన స్టేట్ లెవెల్ హాకీ క్రీడలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచి అండర్ 17హాకీ నేషనల్లో అర్హత సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి భవిత ఒక్కరే ఎంపిక అయ్యింది . జార్ఖండ్ లో జరిగే నేషనల్ హాకీ పోటీలో పాల్గొంటున్న సందర్భంగా చర్ల మండలంలోని ప్రజలు లింగాపురం ప్రజలు భవిత తండ్రి తడికల అజయ్ కుమార్ ను తడికల భవితను అభినందించారు .ఏజెన్సీ ఏరియాలో పుట్టి హాకీ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నేషనల్ అండర్ 17 హాకీ టోర్నమెంట్ కు ఎంపికైన సందర్భంగా జార్ఖండ్ వెళ్లి ఆడుతున్న తడికల భవితకు చర్ల మండల వాసులు అభినందనలు తెలియజేసి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరచి విజయం సాధించి తిరిగి రావాలని చర్ల మండలానికి పేరు తీసుకురావాలని కోరుకున్నారు .

## 108 సేవలు కరువు.. అధికారుల నిర్లక్ష్యమే కారణం!

(మొదటి పేజీ తరువాయి...)

ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని ప్రజలు వాపోతున్నారు. అంబులెన్స్ కోసం ఎదురు చూస్తూ గాయపడిన వారు రోడ్లపైనే విలవిలలాడిన పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు. అంబులెన్స్ సిబ్బందిని ప్రశ్నించగా కొత్తగూడెం నుంచి వరంగల్, ఖమ్మం వంటి దూర ప్రాంతాలకు రోగులను తరలించాల్సి రావడంతో మండలంలో అంబులెన్స్ ఖాళీగా ఉండడం లేదని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. కానీ మారుమూల ఏజెన్సీ మండలాన్ని ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు అంబులెన్స్ పంపడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రజలు, వృద్ధులు, గర్భిణీలు, విద్యార్థులు ఉన్నారని, ఎప్పుడు ఏ అత్యవసరం వస్తుందో తెలియని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో 2500 మందికి పైగా విద్యార్థులు వసతి గృహాల్లో చదువుతున్న నేపథ్యంలో అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటనలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైనప్పుడు అత్యవసరంగా అంబులెన్స్ లు ఏర్పాటు చేసి చికిత్సకు తరలించిన సందర్భాన్ని గుర్తు చేస్తున్నారు. అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కావున మండలానికి మంజూరైన 108 అంబులెన్స్ ను దూర ప్రాంతాలకు తరలింపుల పేరుతో బయటకు పంపకుండా స్థానిక ఏజెన్సీ ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల ప్రాణాలతో చెలగాటమే అవుతుందని మండలవాసులు హెచ్చరిస్తున్నారు.

## ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం పరుచుకోవాలి



(మొదటి పేజీ తరువాయి...)

పరిరక్షిస్తామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా మా ఓటు హక్కును వినియోగిస్తామని" ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద ఓటు హక్కు వినియోగం, పై నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రజాస్వామ్య విలువలు, ఓటు ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా ఈ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ రైల్వే స్టేషన్ వరకు కొనసాగగా, ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున యువత, నూతన ఓటర్లు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియోగంపై అవగాహన సందేశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖల అధికారి పరంధామ రెడ్డి, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్ , పాల్వంచ తాసిల్దార్ ధారా ప్రసాద్, ఎన్నికల ట్రైనర్ సాయి కృష్ణ,ఎన్నికల సిబ్బంది నవీన్,సంబంధిత శాఖల అధికారులు, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## రెండు ఆయుధ డంప్ లు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

సంబంధిత పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పాలగూడ శిబిరానికి దక్షిణంగా ఉన్న అటవీ ప్రాంతంలో నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ జరిగింది.ఆపరేషన్ కు ఎఫ్ /150 కంపెనీకి చెందిన చీతా రోషన్ కుమార్ ఝా ,జి /150కంపెనీకి చెందిన చీతా అజయ్ కుమార్ నాయకత్వం వహించగా మొత్తం ఆపరేషన్ ను 150వ బెటాలియన్ కమాండెంట్ రాకేష్ చంద్ర శుక్లా పర్యవేక్షించారు. క్యూ ఏ టి /150 నుండి ఒక బృందం కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొంది. ఈ సోదాల సమయంలో, అడవిలోని రెండు నక్సలైట్ రహస్య స్థావరాల నుండి ఆయుధాల డంప్ లను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నక్సలైట్లు ఆయుధాలను పేలుడు పదార్థాలను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు .

# ఐడిఓసి కార్యాలయంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్






**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్ జనవరి 25: ప్రజా జ్యోతి** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో భాగంగా ఐడిఓసి కార్యాలయ ప్రాంగణంలో బి ఎల్ ఓ లకు నిర్వహించిన ముగ్గుల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని కలెక్టర్ తెలిపారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించే విధంగా బూత్ లెవెల్ అధికారులు రూపొందించిన ముగ్గులు అందరి మన్ననలు పొందాయన్నారు. అదేవిధంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. చిన్న వయసులోనే ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అనంతరం ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్న బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు)కు అవసరమైన కిట్లను జిల్లా కలెక్టర్ అందజేశారు. అలాగే ఎన్నికల విధుల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ ఎలక్టోరల్ అధికారులుగా ఎంపికైన తాసిల్దార్లు, జిల్లా మాస్టర్ ట్రైనర్ కు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండరలను ప్రత్యేకంగా సన్మానించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాజంలోని ప్రతి వర్గం భాగస్వామ్యమని ఆయన ఈ సందర్భంగా అన్నారు.అనంతరం కార్యాలయంలోని ప్రతి ఒక్కరి చేత ప్రతిజ్ఞ చేయించారు, ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, తాసిల్దార్లు పుల్లయ్య, ధార ప్రసాద్, ఎన్నికల జిల్లా మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, సంబంధిత శాఖల అధికారులు విద్యార్థులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లు, నూతన ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

- ప్రజాస్వామ్యానికి ఓటు ఆయువుపట్టు
- తహశీల్దార్ బి సంధ్యారాణి





**ప్రజా జ్యోతి చంద్రుగొండ జనవరి 25** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం లో ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం-2026 పురస్కరించుకుని మండల కేంద్రంలో నీ రెవిన్యూ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, స్థానిక యువత, విద్యార్థులతో కలిసి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం గా ఏర్పడి నిర్భయంగా కుల మత వర్గాలకు అతీతంగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో ఓటు వేస్తామని అందరూ కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2026 సంవత్సరానికి గాను ఓటు కంటే మిన్న ఏదీ లేదు. నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకుడు, ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు విలువను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఇంచార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘు, ఏఎస్సై పాపయ్య, కానిస్టేబుల్స్ రాంబాబు, శివ, జూనియర్ అసిస్టెంట్లు, జిపిఓ లు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక పౌరులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి...)

మున్సిపల్ ఎన్నికల్లో 24 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరైనా సరే ప్రజలు ఓట్లు వేసి ఆదరించాలని కోరారు. ప్రజల ఆశీర్వాదాలతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. గత రెండు పర్యాయాలు రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని, పథకాలను ప్రచారాలకే పరిమితం చేశారు తప్ప వాటిని కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వంలో పథకాల పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

♦ **జిల్లా ఆహార భద్రతాధికారి శరత్**



**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 25:ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నకిలీ ఫుడ్ ఇన్స్పెక్టర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆహార భద్రత అధికారి కోరారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని చిన్న ,పెద్ద ఆహార వ్యాపార సంస్థలకు ఫోన్ ద్వారా కొంతమంది వ్యక్తులు తమను ఆహార భద్రత శాఖకు చెందిన అధికారులుగా పరిచయం చేసుకుని అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఇప్పుడు ఇన్స్పెక్టర్ శరత్ తెలిపారు. ఒక వ్యక్తి తనను “ఫుడ్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ నాయుడు”గా పరిచయం చేసుకుంటూ మొబైల్ నంబర్ 8886397761 నుండి ఆహార వ్యాపారదారులకు ఫోన్ చేసి డబ్బులు కోరుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తికి ఆహార భద్రత శాఖతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా తెలియజేశారు. కావున భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని ఆహార వ్యాపార సంస్థల యజమానులు ఇలాంటి ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని, ఫోన్, యూపీఐ లేదా నగదు రూపంలో ఎవరికి కూడా డబ్బులు చెల్లించవద్దని జిల్లా ఆహార భద్రత శాఖ సూచిస్తోంద నీ, అధికారుల పేరుతో డబ్బులు అడగడం పూర్తిగా మోసంగా భావించాలన్నారు, ఆహార భద్రత శాఖకు సంబంధించిన లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు , ఫీజులు కేవలం అధికారిక విధానంలో మాత్రమే వసూలు చేయబడతాయని, వ్యక్తిగత ఫోన్ కాల్స్ ద్వారా ఎలాంటి చెల్లింపులు ఉండవని , ఇలాంటి నకిలీ ఫోన్ కాల్స్ లేదా మోసపూరిత ప్రయత్నాలు ఎదురైనట్లయితే వెంటనే జిల్లా ఆహార భద్రత శాఖ, పాల్వంచలోని ఐడీఓసీ కార్యాలయం, రూమ్ నెంబర్ F-3 వద్ద సమాచారం అందించాలని, వ్యాపారదారులకు జిల్లా ఆహార భద్రతాధికారి శరత్ తెలిపారు.

# కాంగ్రెస్ లోకి “ఎస్.జె.కె.అహ్మద్” దంపతులు



**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 25,ప్రజా జ్యోతి** పాల్వంచ పట్టణ పరిధిలోని 7వ డివిజన్ వనమా కాలనీకి చెందిన నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్, ఆయన సతీమణి నూర్జహాన్ పర్వీన్, వనమా కాలనీ ప్రజలతో కలిసి భారీ సంఖ్యలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. 1993లో నేతాజీ యువజన సంఘాన్ని స్థాపించిన అహ్మద్ గత 32 సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గుర్తింపు పొందారు. 7వ డివిజన్ వనమా కాలనీ ఏర్పాటు,అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి ఆయన కీలక పాత్ర పోషించారు, నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ నాయకత్వంలో సాగుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన పలువురు ప్రముఖులు వివిధ సందర్భాల్లో అభినందనలు అందుకున్నారు. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, శ్రీ గణేష్ నారాయణ్, రాష్ట్రీయ లోక్ జన శక్తి పార్టీ కిసాన్ మోర్చ జాతీయ అధ్యక్షుడు సుభాష్ బిహార్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి. ప్రసాద్ తదితరులు ఆయన సేవలను ప్రశంసించారు. ఇక ఆయన వెంటే నేను అంటూ.. తన భర్త అహ్మద్ స్థాపించిన నేతాజీ యువజన సంఘం ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో నూర్జహాన్ పర్వీన్ కీలక పాత్ర పోషిస్తూ మంచి పేరు సంపాదించారు. 7వ డివిజన్ ప్రజలకు సుపరిచితురాలైన ఆమెకు స్థానికులు సంఘీభావం తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆళ్ళ మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు డీఎస్పీగా సారంగపాణి



**ఇల్లందు, జనవరి 25, ప్రజాజ్యోతి:** రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం జరిగిన డిఎస్పీల బదిలీలలో భాగంగా హైదరాబాద్ టిజీపీఏ లో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సాదుల సారంగపాణిని ఇల్లందు డిఎస్పీగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఇల్లందు డిఎస్పీగా పనిచేస్తున్న ఎన్ చంద్రభాను ను హైదరాబాద్ డిజిపి ఆఫీస్ కు బదిలీ చేశారు. సాదుల సారంగపాణి ఇల్లందు పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ, సీఐ గా విధులు నిర్వహించారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభం

♦ **ఏ పీ వో ఈసీ ఉర్సు సాంబశివరావు**



**చర్ల, జనవరి 25:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని 26 గ్రామపంచాయతీ పరిధిలో గల గ్రామాలలో సోమవారం నుంచి ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్నట్లు గా ఏపీవో ఈసీ సాంబశివరావు తెలిపారు. అందులో భాగంగానే ఆదివారం ఆయా గ్రామాలలోని ఉపాధి హామీ పనులను మొదలు పెట్టుకునేందుకు లేబర్ మోబిలైజేషన్ చేయడం జరిగిందని ఆయన అన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న నర్సరీలో కూడా ఉపాధి హామీ పనులు చేసుకునేటట్లుగా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారని ఆయన తెలిపారు. మండలంలోని ఉపాధి హామీ పనులను పర్యవేక్షించడం కోసం పదిమంది పిల్డ్అసిస్టెంట్లు ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు డిఆర్డిఓ ఆదేశాల ప్రకారం ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తారని ఆయన అన్నారు. కావున జాబు కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో ఈసీ ఉర్సు సాంబశివరావు తెలిపారు.

# జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఉత్తమ ప్రతిభ




**చర్ల, జనవరి 25:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ఆదివారం లైన్స్ క్లబ్ ఆఫ్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని చర్ల మండలంలోని విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలను చర్ల ప్రకృతి వనం ఆవరణలో నిర్వహించారు .ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పోటీల్లో వారి యొక్క ప్రతిభని కనబరిచారు. ఈ సందర్భంగా తెగడ జడ్పీహెచ్ ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రధమ ద్వితీయ బహుమతులను పొందారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ అనే అంశంమీద జడ్పీహెచ్ ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.వ్యాసరచన డెబిట్ విభాగములో ఎస్ డి. ఖైరునిషా , డెబిట్ లో పీ .అక్షిత వరుసగా ప్రధమ,ద్వితీయ బహుమతులు సాదించారు.ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ డైరెక్టర్ అండ్ కో -ఆర్డినేటర్ లు స్టూడెంట్స్ కి నగదు మెమోంటోస్ సర్టిఫికెట్లు అందించారు. మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు నరేష్, రాజు పాల్గొన్నారు .

# ఏజెన్సీ గ్రామీణ వైద్యుల నూతన కమిటీ ఎంపిక



**ఇల్లందు, జనవరి 25, ప్రజాజ్యోతి:** ఇల్లందు మండలంలో ఏజెన్సీ గ్రామీణ వైద్యుల నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. అధ్యక్షునిగా కిరణ్, ఉపాధ్యక్షునిగా అన్వర్ భాష, కార్యదర్శిగా ఎల్ శ్రీనివాస్, కోశాధికారిగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా పీ. మోహన్ రావు, చందు, ప్రదీప్, శివ, సోషల్ మీడియా ప్రతినిధిగా హిమం భాష మీడియా ప్రతినిధిగా ఆర్. లక్ష్మయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బుచ్చి నారాయణ, పురుషోత్తం, వెంకన్న, వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులుగా సంపత్, నాగేష్, రవి రాములను నియమించారు.

# అంబులెన్స్ లో ప్రసవం తల్లీ బిడ్డ క్షేమం



**చర్ల, జనవరి 25 :(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం లోని చిన ముసిలేరు గ్రామానికి చెందిన సపక ఇందు మొదటి కాన్పు కోసం సత్యనారాయణ పురం పీహెచసీ కి రాగ పరీక్షలు నిర్వహించిన వైద్యులు రక్తం తక్కువగా ఉన్నందున భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసారు . అంబులెన్స్ లో తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నాయిగూడెం వద్ద నొప్పులు అధిఖం కావడంతో అంబులెన్స్ లోనే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వారిని భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. తమను సురక్షితంగా భద్రాచలం చేర్చిన అంబులెన్స్ పైలట్ మధుకి ,ఈఎంటి రాధాకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# బీసీలకు రాజ్యాధికారం రావాలి




**ఇల్లెందు టౌన్, జనవరి 25, ప్రజాజ్యోతి:** బీసీలకు రాజ్యాధికారం రావాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఆదివారం బీసీ సంఘాల రాష్ట్ర కన్వీనర్ మడత వెంకట్ గౌడ్ సూచనల మేరకు బీసీ సంఘ నాయకులు మూడవ రోజు ఇల్లందు పట్టణంలోని 8, 9, 10, 11, 12, 13, 14, 15 వార్డులలో బీసీ సంఘాల బహుజన యాత్ర నిర్వహించారు. బీసీ సంఘాల బహుజన యాత్రకు పడిదల నవీన్, దండు సారయ్య స్వాగతం పలికారు. రాజకీయాలలో బిసి ల ప్రాధాన్యత పెరగాలని త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బిసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాణాల శ్రీను, కోటగిరి రాజేందర్ మామిడి శివ, మునాఫ్, మెరుగు భరత్, స్వామి నాయక్, శేషు, విక్కీ, గోపి, పలువురు బిసి రిజర్వేషన్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# సూర్య నమస్కారాలతో పరిపూర్ణ ఆరోగ్యం

♦ **యోగ గురువు చిరు తాని రమాదేవి**

**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 25,ప్రజా జ్యోతి** సూర్య నమస్కారాలతో శరీరంలోని నాడి వ్యవస్థను శుద్ధిచేసి సర్వ రోగాలను హరించి పరిపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని యోగా గురువు చిరు తాని రమాదేవి అన్నారు, ఆరోగ్యానికి హేతువైన సూర్యుడు జన్మించిన రథసప్తమిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక కేటీపీఎస్ బొంబాయి కాలనీలో 108 సూర్య నమస్కారాలు కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ యోగ కార్యక్రమానికి హాజరైన కేటిపీఎస్ ఏడిఈ లు, డి ఇ లు పలువురు కాలనీవాసులు హాజరు కాగా వారికి యోగ గురువు రమాదేవి ఆధ్వర్యంలో ఉదయం 5:30 గంటల నుండి 8 గంటల వరకు నిర్విరామంగా సూర్య నమస్కారాలు చేయించారు

